క్లుప్తంగా

కంటి పరీక్షలకు 115 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాముల గుడివీధిలోని జైన్ కార్యాలయంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తిరుపతి ఎస్వీ అరవింద్ ఆస్పత్రి వైద్యులచే కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరానికి 210 మంది వచ్చారు. వీరికి పరీక్షలు చేయగా ఆపరేషన్‌కు 115 మంది ఎంపికయ్యారు. వీరికి ఉచితంగా ఆపరేషన్, వసతులు కల్పిస్తామని నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, సాగర్, ప్రవీణ్, లలిత్, కమలేష్, అమిత్ పాల్గొన్నారు.

ఇక రెండు నెలలపాటు తనిఖీలు



రైలులో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసు బృందం

చిత్తూరు కార్పొరేషన్: ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో రైల్వేస్టేషన్‌లో రెండు నెలలు తనిఖీలు చేయనున్నట్లు జీఆర్పీ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రైల్వేస్టేషన్‌లో, రైలులో ఆదివారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్‌తో అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రయాణికుల లగేజీలను పరిశీలించి వారికి అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు కొనసాగించనున్నట్లు, ప్రయాణికులు సహకరించాలని ఎస్ఐ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

ఉగ్రదాడి హేయమైన చర్య



పూర్వ విద్యార్థుల సంఘం, మాజీ సైనికుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

ఐరాల: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం అత్యంత హేయమైన అనాగరిక చర్య అని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సీతాపతినాయుడు, మాజీ సైనికులు శ్రీనివాస్‌రావు, రవిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అర్జున్ అన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం, మాజీ సైనికుల ఆధ్వర్యంలో ఆదివారం ఉగ్రదాడిలో బలైన వారికి సంతాపం తెలియజేస్తూ స్థానిక జెండామాను వీధి నుంచి బజారు వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేష్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటే జీవితం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో సంఘ సభ్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఆదివారం బౌద్ధ దమ్మసంఘం ఆధ్వర్యంలో ఒకటే జీవితం పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ జనరల్ డైరెక్టర్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలోని సమకాలీన జీవితాలకు ప్రతిబింబం ఒకటే జీవితం పుస్తకసారాంశమన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, రచయితలు రామలక్ష్మి, అరుణకుమారి, రఘుపతి, రసహదేవనాయుడు, హరినాయుడు తదితరులపాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం



అధికారులను సన్మానిస్తున్న సీఐ, ఎస్ఐ

బంగారుపాళెం: విధి నిర్వహణలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని సీఐ శ్రీనివాసులు అన్నారు. బంగారుపాళెం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్ఐ వళ్లెమ్మ, కానిస్టేబుళ్లు అనిత, ఉమాశంకర్, సురేంద్ర ఇటీవల చిత్తూరు, పుంగనూరు, సదుం పోలీస్ స్టేషన్లకు బదిలీపై వెళ్లారు. బదిలీ అయిన అధికారులను ఆదివారం సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వరి కోతలు మొదలు



గుడిపాల మండలంలో వరి కోతలు మొదలయ్యాయి. గత మూడు నెలలుగా వరి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న రైతన్నలు ఎట్టకేలకు కోతలు ఆరంభించారు. మండలంలోని చిత్తపార, బందపల్లి, పాపసముద్రం, బసవాపల్లి, బొమ్మసముద్రం, చింతగుంటూరు అధికంగా రైతులు వరి పంటను సాగుచేశారు. మండల వ్యాప్తంగా 984 ఎకరాల్లో వరిపంట సాగులో ఉంది. ప్రస్తుతం వరి పంట ఒబ్బిడి పనుల్లో అన్నదాతలు బిజీబిజీగా ఉన్నారు. దీంతో కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది. ఇప్పటికే కొంతమంది వరి కోతలు మొదలుపెట్టేశారు. మరికొంత మంది కోతలు పూర్తి చేసి వడ్లు ఆరబెట్టుకుంటున్నారు. ఎందుకంటే వరి గింజలో తేమ ఉంటే గిట్టుబాటు ధర రాదు. అందుకే రైతులు ముందు జాగ్రత్తగా ధాన్యం ఎండబెడుతున్నారు. మరి కొంత మంది ఒబ్బిడి చివరి దశలో వడ్లను తూర్పార పడుతున్నారు.

– గుడిపాల



బిల్లుతో మోసాలకు చెల్లు

- వస్తువుల నాణ్యతపై బెంగ వద్దు
- సేవా లోపాలపై ఫిర్యాదులకు రశీదు తప్పనిసరి
- వినియోగదారుల ఫోరంతో మోసాలకు అడ్డుకట్ట

బంగారుపాళెం: దైనందిన జీవితంలో ఎన్నో వస్తువులను కొనుగోలు చేస్తూ ఉంటాం. ప్రతి రోజూ దుకాణంలో ఏదో ఒకటి కొంటూ ఉంటాం.. కొన్ని చోట్ల కొందరు దుకాణదారులు నాసిరకం వస్తువు లను అంటగడుతుంటారు. కనీసం రసీదులు కూ డా ఇవ్వకుండా మోసం చేస్తూ ఉంటారు. అయితే మనం కొనుగోలు చేసిన వస్తువుల్లో నాణ్యత లోపించినప్పటికీ .. ఏం చేయాలో తెలియక సతమతమవుతుంటాం. ఇలాంటి సమయంలోనే వినియోగదారుల కోసం 'వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం' అండగా నిలుస్తుంది. ఆయా వస్తువుల నాణ్యతలో తేడాలు వచ్చినప్పుడు రశీదు ఉంటే తగిన పరిహారం పొందే వీలుంటుంది.

సమస్య పరిష్కారం ఇలా..

మోసాలు, కొలతలు, ఇబ్బందులు, సేవలు ఇలా ఏ అంశంలోనైనా వినియోగదారునికి ఇబ్బంది కలిగితే వినియోగదారుల పరిరక్షణ చట్టం ద్వారా సమస్య పరిష్కారంతో పాటు పరిహారం కూడా పొందే వీలుంది. వినియోగదారుల సేవలకు ఆటంకం, నష్టం కలిగితే సంబంధిత వ్యక్తులు, సంస్థలపై ఫిర్యాదు చేయవచ్చు. వినియోగదారు తూకాల్లో మోసపోయినా, వస్తువుల్లో నాణ్యత లోపించినా, సేవలు సక్రమంగా అందకపోయినా ఫిర్యాదు చేయవచ్చు. ఉదాహరణకు చిన్న సూది నుంచి బ్యాంకింగ్, ఆసుపత్రి, రైల్వే, విమానయానం, విద్యుత్, కొరియర్ సర్వీస్, గ్యాస్, ఫుడ్ డెలివరీ ఇలా అన్ని రకాల సేవల విషయంలో ఇబ్బందులు ఏర్పడినప్పుడు ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందవచ్చు. అంతే కాకుండా మార్కెట్లో కొనుగోలు చేసే వస్తువుల నాణ్యత ప్రమాణాల్లో లోపాలు, తేడాలు, ఎంఆర్పీ కంటే ఎక్కువ వసూలు చేసినా, వస్తువుల్లో ముద్రించిన పరిమాణం కన్నా తక్కువ ఉండి నష్టపోయినా ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చు.

బిల్లు తీసుకోవడం తప్పని సరి

నియోజకవర్గంలో పూతలపట్టు, ఐరాల, తవణంపల్లె, బంగారుపాళెం, యాదమరి మండలాల్లో వందల సంఖ్యలో పలు రకాల దుకాణాలు ఉన్నాయి. ఒక్క ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ దుకాణాల్లో తప్ప మిగిలిన దుకాణాల నిర్వాహకులు కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లులు ఇవ్వడం లేదు. వస్తువులు కొనుగోలు చేసిన తర్వాత బిల్లు తీసుకోవాలన్న స్పృహ కూడా తగ్గిపోతుంది. ఇదే అంశం దుకాణదారులకు వరంగా మారుతోంది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహన లేకపోవడంతో చాలా మంది కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లు ఇవ్వమని అడగడంలేదు. ఒకవేళ కొందరు బిల్లు అడిగినా వ్యాపారులు తెల్లకాగితంపై రాసి ఇస్తున్నారే తప్ప సరైన బిల్లు మాత్రం ఇవ్వడం లేదు. బిల్లులు తీసుకోవడం ద్వారా కొనుగోలు చేసిన వస్తువుల కారణంగా నష్టపోయినా, సదరు కంపెనీ, దుకాణదారులు మోసం చేసినా వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం నష్టపరిహారం పొందే వీలుంటుంది.

కావాల్సినవి ఇవి

- వస్తువు కొనుగోలు చేసినప్పుడు కచ్చితమైన, సరైన రశీదు/బిల్లు తీసుకోవాలి.
- వినియోగదారుని పేరు, చిరునామా ఎవరిపై ఫిర్యాదు చేస్తున్నారో వారి పేర్లు రాయాలి.
- కొనుగోలు చేసిన వస్తు సేవల వివరాలు, బిల్లు నంబరు, నష్టం విలువ వివరంగా అంకెల్లో రాయాలి.
- కోరుకుంటున్న పరిహారం వివరాలను దరఖాస్తులో తప్పని సరిగా పేర్కొనాలి.



అవగాహన కరువు

వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం గురించి ప్రజలకు కనీస అవగాహన ఉండడం లేదు. సంబంధిత అధికారులు కూడా అవగాహన కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారని ఆరోపణలున్నాయి. వినియోగదారుల పరిరక్షణ చట్టంపై పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వినియోగదారుల చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

ఐరాల: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంచి భవితకు బాటలు వేసేలా సోమవారం నుంచి మే 6 వరకు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు స్థానిక గ్రంథాలయాధికారి సుజాత తెలిపారు. గ్రంథాలయాల్లో నిర్వహించే ఈ విజ్ఞాన శిబిరాల్లో కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, మ్యూజిక్, డ్యాన్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె వివరించారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. మండల స్థాయి అధికారులు హాజరుకావాలని సూచించారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

ఊరెళుతున్నారా.. జాగ్రత్త!



ఎస్ఐ రామ్మోహన్

గుడిపాల: వేసవి సెలవుల పేరుతో విహార యాత్రలకు వెళ్లే వారంతా తమ విలువైన బంగారు, వెండి వస్తువులతో పాటు డబ్బులను భద్రపరచుకుని వెళ్లాలని ఎస్ఐ రామ్మోహన్ సూచించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వేసవిలో దొంగతనాలకు అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అనుమానితులు ఎవరైనా సంచరిస్తుంటే 100, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

మూగజీవాల ఆకలి కేకలు



ప్రస్తుతం మండుతున్న ఎండలకు బీడు భూముల్లో సైతం గడ్డి పూర్తిగా ఎండిపోయింది. మూగజీవాలు మేత కోసం మైళ్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. గొర్రెలు, మేకలు వంటి జీవాలు ఆకలితో అలమటిస్తున్నాయి. దీంతో ఎలా పోషించాలో తెలియక పెంపకందారులకు దిక్కుతోచడం లేదు. మూగజీవాలకు గడ్డి కొనుగోలు చేయడానికి ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మండే ఎండల్లో మేత కోసం బీడు భూముల్లో మూగజీవాలను వదిలిపెట్టి పోషకులు భార్య పిల్లలతో కాపలా కాస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మూగజీవాల పోషణపై దృష్టి సారించి పశుపోషణ శిబిరాలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

– తవణంపల్లె

పొదల మాటున పార్కు



గుడిపాల పోలీస్‌స్టేషన్ ఆనుకొని సుమారు ఎకరా స్థలంలో పోలీస్ పార్కును గతంలో ఏర్పాటు చేశారు. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకొని ఈ పోలీస్ పార్కు ఉంది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారు ఈ పార్క్‌లో కొంతసేపు సేదతీరుతారు. ఇక్కడ వసతుల కోసం గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి మొక్కలను నాటించారు. దీంతోపాటు పార్కింగ్ ఏరియా, వాకింగ్ చేయడానికి ప్రత్యేకంగా ఓ దారిని ఏర్పాటు చేశారు. కూర్చోవడానికి వసతులతో పాటు తాగునీటి వసతులు కూడా ఉండేవి. గత కొద్దిరోజులుగా వాటిని పట్టించుకోకపోవడంతో చెట్లన్నీ ఎండిపోయి ప్రస్తుతం ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయి. ఇకనైనా పోలీసుశాఖ దీనిపై దృష్టి సారించి పోలీస్ పార్కును అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

– గుడిపాల

బస్సును ఢీకొన్న టిప్పర్





గుడిపాల: ప్రమాదానికి గురైన వాహనాలు

గుడిపాల: బస్సును టిప్పర్ లారీ ఢీ కొనడంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. బస్సు గుంటూరు నుంచి విహారయాత్రకు బయల్దేరింది. వేలూరులోని గోల్డెన్ టెంపుల్‌కు వెళ్తున్న బస్సును మండలంలోని ఓరియన్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం టిప్పర్ ఢీ కొంది. ఈ బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులున్నారు. అయితే బస్సు డ్రైవర్ చాకచక్యంగా తప్పించడంతో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. లేకుంటే భారీ నష్టం జరిగి ఉండేది. ఎస్ఐ రామ్మోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

చిత్తూరు అర్బన్: లారీని ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి నగరంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు చిత్తూరు నుంచి తిరుపతి వైపు వెళుతున్న లారీని మురకంబట్టు వద్ద బైక్‌పై వెళుతున్న పెనుమూరు మండలం పూనేపల్లెకు చెందిన ఆసిఫ్(35) ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన ఆసిఫ్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డంపింగ్ యార్డుకు నిప్పు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం లెనిన్ నగర్‌లోని డంపింగ్ యార్డుకు ఆదివారం రాత్రి నిప్పు అంటుకుంది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. శ్రమించి, మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.



అంబేడ్కర్ ఆశయసాధనే సమతా దళ్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా సమత సైనిక్ దళ్ పార్టీ ముందుకు వెళుతోందని ఆ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ అన్నారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. సమతా సైనిక్ దళ్ పార్టీ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. ఈ పార్టీ తరపు పలు సేవ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నామన్నారు. పల్లెల్లో అంబేడ్కర్ ఆశయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వందేళ్ల కార్యక్రమ నిర్వహణకు చిత్తూరు నగరంలోని అంబేడ్కర్ భవనంలో చోటు ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాజబాబు, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం



అమ్మవారికి కల్యాణోత్సవం చేస్తున్న దృశ్యం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

గుడిపాల: మండలంలోని పానాటూరు గ్రామంలో 18రోజుల పాటు నిర్వహించనున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం ద్రౌపదీ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ద్రౌపదీ, ధర్మరాజుల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా పురోహితులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. దీనికి బొమ్మసముద్రం గ్రామానికి చెందిన జయశేఖర్‌రెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు. నిర్వహించారు. భాగవతారిణి హేమలత అమ్మవారి కల్యాణోత్సవానికి సంబంధించిన హరికథను భక్తులకు వినిపించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. మహిళలకు పసుపు కుంకుమ పంపిణీ చేశారు. వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ మధుసూదన్ రెడ్డి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.